# పట్టుబడిన దొంగ

ఎ. శ్రీరామశర్మ

విజయవాడలో ఒక ధనికుని యింటిలో దొంగలుపడి సుమారు మూడులక్షల ఆస్తి దోచుకున్నారు. ఈ విషయంతో ప్రజలలో అలజడి బయలుదేరింది. ఎక్కడచూచినా ప్రజలు యీ దొంగతనం విషయమే మాట్లాడుకుంటున్నారు. ప్రభుత్వం పరిశోధకులను నియమించింది. పోలీసు వారు యీ విషయంలో బాగా శ్రద్ధవహించారు.

పేరుపొందిన యిన్స్పెక్టర్లలో రామయ్య ఒకడు. అతడీ దొంగతనం విషయమై రాత్రింబగళ్లు పరిశోధిస్తున్నాడు. సుమారు రాత్రి తొమ్మిదిగంట లవుతోంది... లక్ష్మీ టాకీసు వెనుకవీధి....నిర్మానుష్యంగా వున్నది ... రామయ్య మామూలుగా గస్తీ తిరుగుతున్నాడు. చాలా జాగ్రత్తలో వున్నాడు. వీధి అంతా నిశ్శబ్దంగావున్నది.

ఇంతలో ఎక్కడనుంచో మాటలు వినవచ్చాయి.

"ఒరేయ్! నంగయ్య నంతు కెంతవచ్చిందిరా?"

"ఎనభై వేలు! నీ కెంతవచ్చిందేమిటి?"

"లక్షాయిరవైవేలు."

"రామయ్యనంతు?"

"లక్షరూపాయలు."

ఇనస్పెక్టరు రామయ్యకు అంతా విశదమైంది. ఇకనేం. దొంగలు దొరికిపోయారు...మూడు లక్షల ఆస్తి కాజేసి భాగాలు పంచుకుంటున్నారు...వీళ్ళని పట్టుకుంటే దెబ్బతో ప్రమోషన్!!!

జాగ్రత్తగా యింటి నంబరు 'నోట్' చేసుకుని దగ్గరనున్న పోలీసుస్టేషనుకు పరుగెత్తాడు. జరిగిన విషయమంతా చెప్పాడు. అందరూ సంతోషించారు. ఈసారి రామయ్యకు తప్పక ప్రమోషన్ వస్తుం దనుకొన్నారు, ఎందుకైనా మంచిదని రెండు గొడ్డళ్లు, నాలుగుకత్తులు నాలుగు రివాల్వర్లు జాగ్రత్తపరచుకొన్నారు. ఐదునిముషాలలో పై సరంజామాతో లక్ష్మిటాకీసు వెనుక వీధిలో రామయ్య "నోట్" చేసివుంచిన యింటిముందు పోలీసుల లారీ ఆగింది.

"టకటకటక..."తలుపుకొట్టారు పోలీసులు. జవాబుశూన్యం... అంతా నిశ్శబ్దం.

మళ్ళీ తలుపుకొట్టారు పోలీసులు. ఈసారయినా జవాబు లేదు.

తప్పకుండా దొంగలే అయివుంటారని నిశ్చయించుకున్నారు. పోలీసులు తీసుకువచ్చిన గొడ్డళ్ళ సహాయంతో తలుపులు పగలగొట్టారు.

లోపల యిద్దరుపిల్లలు తప్ప యింకెవరూలేరు... యిల్లంతా గాలించారు... దొంగలు పారిపోయివుంటారని, వారి ఆచూకీ పిల్లలకు తెలిసివుంటుందని అనుకొని ఆ పిల్లలనిద్దరిని "అరెస్టు"చేశారు.

మర్నాటి వుదయం విచారణ. ఆ పిల్లలు యిద్దరూ యిట్లా చెప్పారు "మేమిద్దరం హైస్కూలులో నాలుగవఫారం చదువుతున్నాము. ప్రస్తుతం మాకు పరీక్షలు. ఈరోజు లెక్కలపరీక్ష... రాత్రి మేము "పెట్టుబడి—లాభములు" లెక్కలుచేసుకుంటుండగా, పోలీసులువచ్చి మమ్మల్నిద్దరినీ పట్టుకున్నారు... ఇంతకు తప్ప మాకింకేమీ తెలియదు..."

విషయం ప్రతివారికీ తెలిసిపోయింది. ఆ పిల్లలిద్దరూ లెక్కలు చేసుకుంటూ, జవాబులు సరిచూచుకుంటున్నప్పుడు, డబ్బుమాట విని దొంగలేమోనని అనుమానపడి "అరెస్టు" చేశారు పోలీసువారు.

అందరూ పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వారు. 'ప్రమోషన్'మాట అటుంచి ముఖం తెలవేశాడు పోలీసు యిన్స్పెక్టరు రామయ్య.

★

రామం: చాలాసేపునుంచి చూస్తున్నా! ఎండలో అలా నిలబడ్డావేరా? సూర్యం.

సూర్యం: చొక్కాని చీమలున్నాయి, చస్తాయని.

—యం. వెం. రా. సామర్లకోట.

శ్రీమదాంధ్ర
మహాభారతము
ఉద్యోగపర్వము
వెల రూ. 1-0-0
ఆంధ్రగ్రంథమాల
మద్రాసు-1.